

19వ వార్డులో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

## శంకర్‌నాయక్‌ను గెలిపించాలి

**మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి**

మహబూబాబాద్, నవంబర్ 14: మహబూబాబాద్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ను మూడోసారి గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి కోరారు. మంగళవారం 19వ వార్డులో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లలోనే రాష్ట్రం ఎంతో ప్రగతి సాధించిందన్నారు. మున్సిపాలిటీగా ఉన్న మానుకోటను జిల్లా చేసి అభివృద్ధి పథంలో నిలిపిన శంకర్‌నాయక్‌ను మళ్లీ గెలిపించాలన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. మానుకోటలో ఎమ్మెల్యే శంకర్‌నాయక్, సీఎం కేసీఆర్ గెలిపించుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలు, నాయకులదే అన్నారు. ప్రచారంలో వార్డు అధ్యక్షుడు చిదిరాల శరత్, మధు, ఎడ్ల శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.



కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## కేసీఆర్ పాలనలోనే పేదలకు లబ్ధి

కేసముద్రం, నవంబర్ 14: స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనలోనే పేద ప్రజలకు లబ్ధి చేకూరుతున్నదని బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ మాజీ మండల అధ్యక్షుడు ధరావత్ భీమానాయక్ అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ మహబూబాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌ను గెలిపించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఆదర్శనగర్‌లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత పాలకులు గిరిజనుల అభివృద్ధిని విస్మరిస్తే, సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించి అభివృద్ధి చేశారన్నారు. పంటల పెట్టుబడికి ఆర్థిక సాయం అందించాలనే ఆలోచన ప్రపంచలో ఏ నాయకుడికి రాలేదన్నారు. కేసీఆర్ రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రైతుబంధు అందిస్తున్నారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే రూ.400కే గ్యాస్, ప్రతి కుటుంబానికి రూ.5లక్షల ప్రమాద బీమా, ఆరోగ్య రక్ష ద్వారా రూ.15 లక్షల వరకు వైద్యసేవలు, తదితర పథకాలు అమలు చేస్తారని, కేసీఆర్‌కు ప్రజలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ధరావత్ కవిత, వీరమ్మ, భారతమ్మ, రవినాయక్, కట్టమల్లు, ఎల్లయ్య పాల్గొన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి

కేసముద్రం, నవంబర్14: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ దామోదర్ అన్నారు. ఓటర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి పొట్టి శ్రీరాములు సెంటర్ వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు ఉన్న వారు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, నిజాయితీగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీంద్రరావు, ఆర్‌ఐలు బాబు, శైలజ, ఏపీఎం రాజవీర్, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భవనం పైనుంచి పడి ఒకరి మృతి

బయ్యారం, నవంబర్ 14: భవనం పై నుంచి పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. చెరువు ముందు కొత్తగూడెం గ్రామానికి చెందిన పాయం లక్ష్మీనారాయణ (38) గంధంపల్లికి చెందిన నాగేశ్వరరావు ఇంటి వద్దకు సెంట్రింగ్ పనులు చేసేందుకు వచ్చాడు. ఈ క్రమంలోనే అదుపుతప్పి భవనం పైనుంచి కింద పడ్డాడు. మహబూబాబాద్ దవాఖానకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడని తెలిపారు.

# పదేళ్లలో రూ.1000 కోట్లతో మానుకోట అభివృద్ధి

- కేసీఆర్‌ను నమ్మినం.. తెలంగాణ తెచ్చిండు, అభివృద్ధి చేసిండు
- శంకర్‌నాయక్‌ను ఆశీర్వదించండి.. పెద్ద పాలేరుగా సేవ చేస్తాడు
- మూడు గంటల కరెంటిచ్చే కాంగ్రెస్ కావాలా..?
- 3 పంటలకు కరెంట్, నీళ్లిచ్చే బీఆర్‌ఎస్ కావాలో ప్రజలే ఆలోచించాలి
- ఓటుతో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి
- మంత్రి సత్యవతిరాథోడ్



ఎన్నికల ప్రచారంలో ర్యాలీగా వస్తున్న ప్రజలు, అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్

నెల్లికుదురు, నవంబర్ 14: పదేళ్లలో సీఎం కేసీఆర్ మహబూబాబాద్ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేశారని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి కష్టసుఖాల్లో తోడుంటున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌ను మరోసారి పెద్ద మనసు చేసుకొని ఆశీర్వదిస్తే పెద్ద పాలేరుగా సేవలు చేస్తూ మీ రుణం తీర్చుకుంటాడని, కారు గుర్తుకు ఓటు వేయాలని గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం మండలంలోని మునిగలవీడు, పార్వతమ్మగూడెం, నెల్లికుదురు, బ్రాహ్మణకొత్తపల్లి, రామన్నగూడెం, కాచికల్, సీతారాంపురం గ్రామాల్లో ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఎమ్మెల్యేకు మహిళలు తిలకం దిద్ది, మంగళహారతులు, బతుకమ్మ, కోలాటాటలతో స్వాగతం పలికారు. మంత్రి సత్యవతి రాథోడ్ మండల కేంద్రంలో ప్రచారంలో పాల్గొన్నారు. హోటల్‌లో జిలేబీలు చేసి, టీ స్టాల్‌లో చాయ్ అమ్ముతూ ప్రచారం చేసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మహిళలతో కలిసి అంబేద్కర్ సెంటర్‌లో కోలాటం ఆడారు. అనంతరం శంకర్‌నాయక్‌తో కలిసి ప్రచారంలో మాట్లాడారు. 'మానుకోట పోరాటాల పురిటిగడ్డ. తెలంగాణ ఉద్యమంలో సీమాంధ్రులను తరిమికొట్టిన రాళ్లకు నోరుంటే బీఆర్‌ఎస్ తరపున ప్రచారం చేసేవన్నారు. మానుకోట గతంలో ఎట్లుండే.. ఇప్పుడెట్లున్నది. మీ కండ్ల ముందు కనిపిస్తున్న అభివృద్ధి కేసీఆర్, శంకర్‌నాయక్ చేసిందన్నారు. సమైక్య పాలనలో మానుకోట అభివృద్ధికి కనీసం రూ.100 కోట్లు కూడా వెచ్చించలేదని, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ పదేళ్లలోనే రూ.1000 కోట్లతో మానుకోటను బంగారు కోటగా మార్చారన్నారు. నాలుగున్నర కోట్ల ప్రజలం కేసీఆర్ సార్‌ను నమ్మినం.. చావు నోట్లో తలపెట్టిండు.. స్వరాష్ట్రాన్ని సాధించి పెట్టిండు, బంగారు తెలంగాణగా మార్చిండు' అని తెలిపారు. 'కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అభివృద్ధిలో వందేళ్లు వెనక్కిపోతాం. పడరాని కష్టాలు పడుతాం' అన్నారు. 'తెలంగాణ రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదు, 10హెచ్‌పీ మోటర్‌తో గంటలో వ్యవసాయానికి నీళ్లందించవచ్చు, ప్రత్యేక తెలంగాణ అవసరంలేదు' అన్న రేవంత్‌రెడ్డిని నమ్మితే మనల్ని నట్టేట ముచ్చుతాడని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో రైతుబంధు, రైతు బీమా పథకాల అమలుకు కాంగ్రెస్ సిద్ధమా? అంటూ సవాల్ విసిరారు. కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలు నమ్మి ఆగం కావొద్దని సూచించారు. ఓటర్లందరూ ఆలోచించి, ఆత్మవిమర్శ చేసుకొని మీ అమూల్యమైన ఓటును వేయాలన్నారు. అభివృద్ధిని పరుగులు పెట్టించిన బీఆర్‌ఎస్‌కు అండగా నిలిస్తే మరింత ముందుకు సాగుతుందన్నారు. నెల్లికుదురు ప్రజలు రెండు సార్లు శంకర్‌నాయక్‌కు భారీ మెజార్టీ ఇచ్చారని, మళ్లీ పెద్దన్నలా ఆశీర్వదించి ఈనెల 30న కారు గుర్తుకు ఓటు వేసి అభివృద్ధికి పట్టం కట్టాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్ నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ మాయ మాటలను న మ్మి మోసపోవద్దని, అనుక్షణం మానుకోట అభివృద్ధికి పాటుపడిన తనను మరోసారి ఆదరించాలని కోరారు. 'మళ్లీ నన్ను ఆశీర్వదించండి. మీ పెద్దన్నగా, పాలేరుగా సేవలు చేస్తూ మిగిలిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేసుకుందామని ఓటు అభ్యర్థించారు. మానుకోటలో మళ్లీ గులాబీ జెండాను ఎగరవేద్దామని, కేసీఆర్‌కు కానుకఇద్దామన్నారు. కార్యక్రమంలో జడ్పీచైర్‌పర్సన్ అంగోత్ బిందు, జడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ భూక్యా బాలాజీనాయక్, వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేశ్, పార్టీ మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెన్నాకుల శ్రీనివాస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ యాసం రమేశ్, మాజీ ఎమ్మెల్సీ సావిత్రమ్మ, సొసైటీ చైర్మన్లు గుండా వెంకన్న, కాసం లక్ష్మీ చంద్రశేఖర్ రెడ్డి, దేవేదంర్‌రావు, ఆర్‌బీఎస్ మండల కోఆర్డినేటర్ కాసం వెంకటేశ్వర్‌రెడ్డి, తొర్రూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కే విజయ్‌యాదవ్, మర్రి రంగారావు, సర్పంచులు నవీన్‌రావు, రుక్మిణి, యాదగిరి రెడ్డి, యాకయ్య, ఎంపీటీసీ వీ వాణి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బీ అనిల్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బీ బీముడు, ఉపసర్పంచ్ యాకాంతంగౌడ్, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ రెహమాన్, మండల మీడియా ఇన్‌చార్జి ఏ మహేశ్, డెరెక్టర్ రవి, నాయకులు బిక్కునాయక్, రామచంద్రు, ఆదిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బోజ్యానాయక్ పాల్గొన్నారు.



నెల్లికుదురులో ప్రచారంలో భాగంగా జిలేబీ చేస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్, పక్కన ఎమ్మెల్యే శంకర్‌నాయక్

## ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం

ఇనుగుర్తి, నవంబర్ 14: స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలు అమలు చేస్తున్నారని, మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తేనే పేదలు మరింత అభివృద్ధి చెందుతారని పార్టీ గ్రామ అధ్యక్షుడు బేతమల్ల చంద్రయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని 61వ బూత్‌లో బీఆర్‌ఎస్ మానుకోట అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ గెలుపు కోరుతూ ఓటర్లకు ఎన్నికల మ్యానిఫెస్టోను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతు బీమా, ఆసరా పింఛన్లు, అమ్మఒడి, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, డబుల్ బెడ్‌రూం, దళితబంధు, బీసీబంధు వంటి పథకాలు పేదలకు ఆర్థికంగా ప్రయోజనం కలిగిస్తున్నాయని వివరించారు. 24గంటల విద్యుత్ సరఫరా, తాగునీరు, పంట ఉత్పత్తులకు మద్దతు ధర అందించడంతో రైతులు సంతోషంగా వ్యవసాయం చేస్తున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్ మరోసారి అధికారంలోకి వస్తే రూ.400కు గ్యాస్, సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా అర్హులైన మహిళలకు నెలకు రూ.3వేలు, తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతీ కుబుంబానికి రూ. 5లక్షల బీమా, రూ.15లక్షల వరకు ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరానికి రూ.16వేలు అందిస్తారని తెలిపారు. అనంతరం కాంగ్రెస్‌కు చెందిన ఒర్రె కుమార్‌కు బీఆర్‌ఎస్‌లో చేరగా, కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గాడుదుల రాజన్న, నవనందుల శ్రీను, బూర రజినీకాంత్, కొమ్మనబోయిన మహేందర్, జక్కుల రవి, నాయకులు పాల్గొన్నారు.



మ్యానిఫెస్టో వివరిస్తున్న నాయకులు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రయ్య

## జోరుగా బీఆర్‌ఎస్ శ్రేణుల ప్రచారం

గూడూరు, నవంబర్ 14: మండలంలోని గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర నాయకుడు బీరవల్లి భరత్‌కుమార్‌రెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ కాసీం, మండల అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నూకల సురేందర్ గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. లైన్‌తండా, వంపుతండా, హనుమాన్ తండా గ్రామాల్లో ప్రచారం చేశారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే శంకర్ నాయక్ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలు తమకు అందాయని బీఆర్‌ఎస్‌కే ఓటు వేస్తామని ప్రజలు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బోడ కిషన్, ఎమ్మెల్యే తనయుడు సూర్యచంద్ర, సర్పంచ్ జ్యోతి హుమ్లు, బాలూనాయక్, మంగునాయక్, లింగయ్య, హుచ్చు, నరేశ్, మనోజ్, శంకర్, రాజేశ్, సురేశ్, రవి, శ్రీను, రాము, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



లైన్‌తండాలో ప్రచారం చేస్తున్న నాయకులు